క్లుప్తంగా

ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్‌ఆర్‌టీపీ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: సీఆర్ బిస్వాల్ కమిటీ ప్రకారం వెంటనే 1.91లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్లు రిలీజ్ చేయాలని, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం వైఎస్‌ఆర్‌టీపీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు కాశీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారాన్ని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ప్రశ్నపత్రాల కుంభకోణంలో దోషులను కఠినంగా శిక్షించాలని, పరీక్షలు తిరిగి నిర్వహించాలన్నారు.

కాకతీయ గ్రిల్ రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎంపీ వెంకటేష్ నేత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని లక్సెట్టిపేట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కాకతీయ గ్రిల్ రెస్టారెంట్‌ను ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎంపీ వెంకటేష్ నేత ముఖ్య అతిథులుగా పాల్గొని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోని రుచికరమైన, నార్త్ ఇండియన్ వంటకాలు అన్ని కూడా రెస్టారెంట్‌లో లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్, అంకం నరేష్, డాక్టర్ రాజ్‌కిరణ్, సందే తిరుపతి పాల్గొన్నారు.

16న మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రం మంచిర్యాల మోడల్‌స్కూల్‌లో ఈ నెల 16న ఆరు నుంచి 10వ తరగతి వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతికి ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 7నుంచి 10వ తరగతి ప్రవేశాలకు మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

అనుమతి లేని వాహనాలు సీజ్ చేయాలి

మందమర్రిరూరల్: మందమర్రిలో శ్రీ చైతన్య పాఠశాలల బస్సులు అనుమతులు లేకున్నా విద్యార్థులను తీసుకెళ్తున్నాయని, అలాంటి బస్సులను వెంటనే సీజ్ చేయాలని విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బసుల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడం వల్ల విద్యార్థులు ఇబ్బందికి గురవుతున్నారని, రక్షణ కూడా లేకుండా పోయిందని ఆరోపించారు. రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'మనఊరు-మనబడి' అక్రమాలపై ఫిర్యాదు

మంచిర్యాలఅగ్రికల్చర్: 'మనఊరు-మనబడి'లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ తాండూర్ మండల బీజేపీ నాయకులు తాళ్లపెల్లి భాస్కర్‌గౌడ్ బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూర్ మండలంలోని రేచిని గ్రామంలో 'మనఊరు-మనబడి' కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న హైస్కూల్ ఐదో తరగతి గదుల నిర్మాణంలో గుత్తేదారు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, నాసిరకంగా నిర్మిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్‌కు ప్రమాదం పొంచి ఉందని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు.

గర్భిణులకు సీమంతం



భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంకుసాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజితతో పాటు మహిళలు కలిసి గర్భిణులకు పూలు, పండ్లు, స్వీట్లు అందజేశారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుశీల, రమాదేవి, దుర్గ, శారద, బాలింతలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



విద్యార్థులతో భవన సముదాయాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తాండూర్: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, జీవితం బంగారు మయమవుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని రేచినీ గ్రామంలో 'మన ఊరు-మనబడి' కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించిన భవన సముదాయాలను బుధవారం విద్యార్థులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా మెరుగైన విద్యాబోధన అందిస్తోందన్నారు. ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తూ, విద్యార్థుల భవిష్యత్‌కు దోహదపడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందని, పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించడంతో పాటు ఫర్నీచర్, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. స్వప్రయోజనాల కోసమే కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్యాలతో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలను టార్గెట్ చేసుకుని ప్రజల్లో చులకన భావం ఏర్పడేలా దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రజల కోసం పాటు పడతారన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ బానయ్య, ఎంపీటీసీలు శంకర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ దత్తుమూర్తి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో ప్రభాకర్, సర్పంచ్ దుర్గుబాయి తదితరులు పాల్గొన్నారు.

'బతుకులు మారాలంటే చదువుతోనే సాధ్యం'

కాసిపేట: దళిత బిడ్డల బతుకులు మారాలంటే చదువుతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని కోమటిచేనులో బుధవారం ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యఅతిథిగా హాజరై కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ చంద్రయ్య, సర్పంచ్ శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు పోశం, ఎంపీటీసీ చంద్రమౌళి, కమిటీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని 11వార్డు రైల్వే స్టేషన్ ఏరియాలో నెలికంటి సర్వేశ్వర్ సారయ్య జ్ఞాపకార్థం భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా బుధవారం రాత్రి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ఆ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సెలర్ బొడ్డు నారాయణ, పలువురు కౌన్సెలర్లు, బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గుడిపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలి

- సాధారణ సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ తీర్మానం
- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓకు తీర్మానం కాపీ అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మందపల్లి స్వర్ణలత ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజీపూర్ మండలం గుడిపేటలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంపీపీ స్వర్ణలత, జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, ఎంపీటీసీలు, సర్పంచులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేలా చూడాలని ఎంపీడీఓ అబ్దుల్‌హైకి తీర్మాన కాపీని అందజేశారు. అనంతరం ఆయా శాఖల అధికారులు గ్రామాల్లో చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనుల వివరాలను జాబితా రూపంలో సభ్యుల సమక్షంలో వెల్లడించారు. ఈ వేసవిలో గ్రామాల్లో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ స్వర్ణలత సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ శిల్ప, వైస్ ఎంపీపీ రమాదేవి, ఎంపీపీ కో ఆప్షన్ ఎం.డీ.రఫీక్, ఎంపీడీఓ అబ్దుల్‌హై, సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుపై మురుగు..



భీమారం: మండలకేంద్రంలోని లంబాడితండా నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన సీసీ రహదారిపై మురుగునీరు ప్రవహిస్తున్నాయి. కొన్ని నెలలుగా పరిస్థితి అలాగే ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మురుగు కాలువల్లో మట్టి నిండి అధ్వానంగా తయారయ్యాయి. దుర్గంధం వస్తోందని సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: వేముల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి **ఫోన్ నంబర్:** 85558 98819

ప్రజాపోరు యాత్ర విజయవంతం చేయండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్



మాట్లాడుతున్న కలవేన శంకర్

పాతమంచిర్యాల: సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి మే నెల 18వరకు నిర్వహించే ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా సమితి నాయకుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూర్ నుంచి ప్రజాపోరుయాత్ర ప్రారంభించి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ హాజరవుతారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ద్వంద విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాపోరు యాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, జోగుల మల్లయ్య, బొల్లం పూర్ణిమ, మామిడాల రాజేశం, దాగం మల్లేష్, మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, శ్రీనివాస్, వనం సత్యనారాయణ, చాడా మహేందర్‌రెడ్డి, శంకరయ్య, జోగుల మల్లయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మేకల దాసు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

అనాథల భూమిపై అధికారుల కన్ను

వేమనపల్లి: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కనక గంగాధర్‌కు అటవీభూమి ఉంది. ఆయన 2008లో అనారోగ్యంతో మృతి చెందాడు. గత ఏడాది క్రితం గంగాధర్ భార్య వేరే వ్యక్తిని పెళ్లి చేసుకొని వెళ్లిపోయింది. దీంతో ముగ్గురు పిల్లలు భాగ్యలక్ష్మీ, శైలజ, చామంతి అనాథలయ్యారు. భూమిని సాగు చేసుకునే స్తోమత లేక బీడుగా ఉంటుంది. ఉపాధి హామీ అధికారులు ఈ భూమిలో ఊట చెరువు నిర్మాణం చేపడుతున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి గ్రామానికి వెళ్లి పనులు నిలిపివేయాలన్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పల్లవి మోడల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని బుధవారం పీడీఎస్‌యూ విద్యార్థి సంఘ నాయకులు కలెక్టరేట్ ఏవోకు ఫిర్యాదు చేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

దండేపల్లి: మండలంలోని గుడిరేవులో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ మంత్రి బోడ జనార్దన్, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విగ్రహ దాత మేకల అరుణ, ప్రభాకర్, సర్పంచ్ లింగవ్వ, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మధు, మండల అధ్యక్షుడు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

రామకృష్ణాపూర్/పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో, రామకృష్ణాపూర్‌లో సింగరేణి డాక్టర్ రాజరమేష్ ఆధ్వర్యంలో ముస్లిం కుటుంబాలకు రంజాన్‌ను పురస్కరించుకుని బుధవారం తోఫా పంపిణీ చేశారు.

పంచాయతీ కార్యదర్శుల సంబురాలు



కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంపీపీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/కోటపల్లి/నెన్నెల/భీమిని: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్)గా నాలుగు సంవత్సరాల ప్రొబెషనరీ కాలం పూర్తి చేసుకున్నందునా బుధవారం పలు మండలాల్లో పంచాయతీ కార్యదర్శులు సంబురాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు వారికి సన్మానం చేశారు. తమను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

జయంతి ఉత్సవాలు విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రభాకర్, సునీల్‌మాదిగ

నస్పూర్: బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతీబా పూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిలను పురస్కరించుకొని ఈ నెల 23న నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సునీల్ మాదిగ, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌తో కలిసి విడుదల చేశారు. మాదిగ హక్కుల దండోర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు, పార్టీలకు అతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పూదరి కుమార్, రేగుంట చంద్రశేఖర్, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి కొండ్ర ఉదయ్ మాదిగ, పట్టణ కన్వీనర్ అట్కపురం సమ్మయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులున్నది ప్రజల కోసమే..!

- మంచిర్యాల సీఐ రాజు



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ రాజు

మంచిర్యాలక్రైం: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో బుధవారం సాయంత్రం 5గంటల నుంచి 7గంటల వరకు 30మంది పోలీస్ బలగాలతో నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరి ఇంటిలో నివాసం ఉంటున్న వారి ఆధార్ కార్డు, వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానితుల వివరాలను ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ సేకరించారు. వాహనాల పత్రాలు పరిశీలించారు. పత్రాలు లేని 50ద్విచక్రవాహనాలను, 2ఆటోలను సీజ్ చేశారు. అనతరం స్థానిక యువకులకు వాలీబాల్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రాజు మాట్లాడుతూ మీరు సహకరిస్తే.. మేము మీకు సహాయం చేస్తామని తెలిపారు. రామగుండం కమిషనర్ రెమా రాజేశ్వరి, స్థానిక డీసీపీ సుధీర్‌రాంనథ్ కేకన్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు తాసినొద్దీన్, రాజేందర్, ఉదయ్‌కిరణ్, సుగునాకర్, షీ టీమ్ ఎస్సై రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిలో కార్మికుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గనిపై బుధవారం సమావేశం నిర్వహించి, గని మేనేజర్ రవీందర్‌కు వినతిపత్రం సమర్పించారు. గనిలో నార్త్ బ్లాక్‌లో కొత్త ఎస్‌డీఎల్ ద్వారా ప్రైవేట్ వారితో బొగ్గును తీసే ప్రయత్నం యాజమాన్యం మానుకోవాలని, కార్మికుల సంఖ్య పెరిగినందున వెంటనే సామాను పెట్టుకునేందుకు అన్ని వసతులతో రెస్ట్ హాల్ నిర్మించాలన్నారు. బైక్ షెడ్ మ్యాన్ వే దగ్గర, మాగ్జిన్‌లో ఇష్యూ రూం, సర్వే మజ్దూర్‌లు, ఫ్యాన్ హౌజ్ వద్ద కార్మికులు ఉండటానికి రూంలు నిర్మించాలని డిమాండ్ చేశారు. నార్త్ బ్లాక్‌లో గాలి సక్రమంగా అందక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే అంతర్గత ఎయిర్ వాల్స్ నిర్మాణాల వేగవంతం, మ్యాన్ రైడింగ్ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, గోల్ల శ్రీనివాస్, పులి శంకర్, బొడ్డుల వెంకటేష్, లింగమూర్తి తదితరులున్నారు.

ఆర్‌కే ఓసీని సందర్శించిన జీఎం



రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కే ఓపెన్‌కాస్ట్ గనిని బుధవారం ఏరియా జీఎం మోహన్‌రెడ్డి సందర్శించారు. జీఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన తొలిసారి గనికి విచ్చేశారు. గనిలోని వ్యూపాయింట్ నుంచి క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేసి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మధుసూదన్, మేనేజర్ వెంకటేశ్వర్లు, ఇంజినీర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్‌ను కలిసిన ఏరియా జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డి బుధవారం క్యాతన్‌పల్లిలోని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ నివాసానికి వెళ్లి సుమన్‌తో పాటు పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేతను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. సింగరేణి ఏరియా అభివృద్ధికి సహకరించాలని కోరారు.

బొగ్గుబాయి వార్తలు

పారదర్శకంగా క్వార్టర్ల కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో బుధవారం క్వార్టర్ల అలాట్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలో 61క్వార్టర్లు ఖాళీగా ఉన్నట్లు యాజమాన్యం ప్రకటించగా 106మంది దరకాస్తు చేసుకున్నారు. సీనియారిటీ ప్రకారం 24మంది ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించారు. ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. క్వార్టర్ల కౌన్సెలింగ్ పారదర్శకంగా జరిగిందన్నారు. ఎస్వో టూ జీఎం ఓదెలు, కేకే-గ్రూపు ఏజెంట్ రాందాస్, అధికారులు ఫణికుమార్, ఆసిఫ్ ఉన్నారు.

ఏరియా ఆసుపత్రిలో కూలర్లు ఏర్పాటు చేయండి

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో కూలర్లు వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఏరియా ఆసుపత్రి ఫిట్ సెక్రెటరి అనుముల సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రి ఇన్‌చార్జి డెప్యూటీ సీఎంఓ డాక్టర్ రాధాకృష్ణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సోకాల శ్రీనివాస్, శ్రేణులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల సభ బహిష్కరించి నిరసన

నెన్నెల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని గుండ్లసోమారం, జంగాల్‌పేట కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యులు భాగం రమేష్, గొలుసుల శిరీష బహిష్కరించారు. అధికార పార్టీ ఎంపీటీసీలకే నిధులు కేటాయిస్తూ.. తమపై వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ అంబేద్కర్, సావిత్రిబాయి పూలే చిత్రపటాలతో సభలో నిరసన తెలిపారు. ఎంపీడీఓ, ఎంపీపీ ఏం చెబితే అది విని నిధుల కేటాయింపులో మాకు అన్యాయం చేస్తున్నారని వెంటనే ఎంపీడీఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఎంపీటీసీలకు వచ్చిన నిధులు ఎంత? ఎవరెవరికి ఎంత కేటాయించారు? వాటి వివరాలు తెలియజేయాలని కోరారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. మండల స్థాయి అధికారులు సమావేశాలకు రారు, సమస్యలు పరిష్కారం కావు అంటూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. మల్టీ పర్పస్ వర్కర్లకు నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా ఎంపీడీఓ వరలక్ష్మి, ఎంపీఓ శ్రీనివాస్ సానుకూలంగా స్పందిస్తూ రెండు, మూడు రోజుల్లో వేతనాలు అందేలా చూస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ శ్యామల, తహసీల్దార్ భూమేశ్వర్, సహకార సంఘం చైర్మన్ మల్లేష్, వైస్ ఎంపీపీ సుమలత, మండల కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, విద్యుత్ ఏఈ మల్లయ్య, ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఝాన్సీ పశువైద్యాధికారి దిలీప్, ఏఓ ప్రేమ్‌కుమార్, ఎంపీటీసీలు తిరుపతి, కమల, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అధిక ధరలతో అన్నదాత కుదేలు..!

- ఫెర్టిలైజర్ దుకాణాల్లో పెరుగుతున్న దోపిడీ
- కలెక్టర్‌కు ఫిర్యాదు

వేమనపల్లి: జిల్లాలోని ఏ గ్రామాల్లో చూసినా అన్నదాత వ్యాపారుల కనుసన్నల్లో బంధీ అయిపోతున్నారు. సాగు కోసం పెట్టుబడి భారమై ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల కొనుగోలు కోసం రైతున్న దుకాణదారుడి ఉచ్చులో పడుతున్నారు. ఉద్దెర రూపంలో కొందరు, నగదు ముట్టజెబుతూ కొంతమంది రైతులు వ్యాపారుల నుంచి నిలువు దోపిడీకి గురవుతున్నారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు, అధిక ధరలకు ఎరువులు అమ్ముతూ వ్యాపారులు లక్షలు గడిస్తున్నారు. ఈ విషయమై గొర్లపల్లి గ్రామానికి చెందిన అరిగెల విష్ణుగౌడ్ కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశాడు. గత నెల 17వ తేదీన గొర్లపల్లి గ్రామానికి చెందిన ఓ ఫెర్టిలైజర్ దుకాణదారుడిపై మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశారు. ఎరువులు, పురుగు మందులు ఏవి తీసుకున్నా తెల్లకాగితంపై బిల్లులు ఇస్తున్నారని, అడ్డగోలు ధరలకు అంటగడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అమ్మిన ప్రతి ఎరువు బస్తా, ఈపాస్ మిషన్ ద్వారా వేలిముద్ర పెడితే ఆధార్ అనుసంధానం చేసి అమ్ముతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో కనబడటం లేదు. విత్తనం, ఎరువులు, పురుగు మందులు ఉద్దెర రూపంలో ఇస్తున్నారు. వడ్డీ అధిక ధరలతో లక్షల్లో డబ్బులు రైతుల నుంచి రాబడుతున్నారు. మందులు, ఎరువులు ఇచ్చిన వ్యాపారులకే పండిన పంట అమ్మాలనే అక్రమ నిబంధనలు అమలు చేస్తున్నారు. దీంతో మోసపోతున్న రైతులు మార్కెట్‌కు వెళ్లి సరసమైన ధరకు పంటను అమ్ముకోలేక ఆర్థికంగా నష్టపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటాం. ప్రతి ఎరువు బస్తాకు ఎమ్మార్పీ ధరపై హమాలీ ఖర్చులు చూసుకొని రైతులు చెల్లించాలి. ప్రతి రైతు ఈపాస్ ద్వారా ఎరువులు తీసుకోవాలి. తెల్లకాగితంపై బిల్లులు ఇస్తే తీసుకోకూడదూ. గొర్లపల్లిలో రైతు ఫిర్యాదుపై విచారణ చేస్తున్నాం.

\- విజయ్‌కుమార్, ఇన్‌చార్జి ఏఓ